కథ

# మనిషి - మేధ

**బృంద తంగిరాల**

పన్నెండు అంతస్థుల తెల్లటి భవనం మీద సింపుల్‌గా నల్లటి అక్షరాల బోర్డు- 'మిలీనియం రీసెర్చ్ కంపెనీ'.

భుజాన ఒక చిన్న బ్యాగ్‌తో అరవింద్ ఆ భవనం ముందు ఆగి పరీక్షగా చూసాడు. తన జేబులో ఉన్న ఒక ఉత్తరం తీసి సరిచూసుకున్నాడు.

'ఇదే అడ్రస్సు' అనుకుంటూ కొంత ఉత్సాహంగా, కొంత అనుమానంగా లోపలికి అడుగు పెట్టాడు. పైకి చాలా మామూలుగా, పాత గవర్నమెంటు ఆఫీసులా ఉన్న ఆ భవనం లోపలకు అడుగుపెట్టగానే తాను సరియైన అడ్రస్‌కే వచ్చానని అరవింద్‌కు అర్థమైంది.

లోపల అత్యాధునికంగా ఉంది. ఎక్కడ చూసినా పాలరాయి, గాజు తలుపులూ, స్టీలూ... మెరిసిపోతున్నాయి ఇంటీరియర్స్ అంతా. సెక్యూరిటీ అన్న చిన్న కౌంటర్ దగ్గరికి వెళ్ళి తన దగ్గర ఉన్న ఉత్తరం చూపించాడు. అక్కడ యూనిఫారంలో వున్న గార్డు ఆ పేపరు చదివి, లోపల నుండి ఒక ఫైలు తీసి, ఫైల్లో ఉన్న ఫోటోతో ఎదురుగా ఉన్న అరవిందును పోల్చి చూసుకున్నాడు. ఫోన్ చేసి ఎవరితోనో మాట్లాడాడు. ఈలోగా అరవింద్ చుట్టూ చూస్తూ నిలబడ్డాడు.

కనీసం మూడు కెమెరాలు అతని వైపు చూస్తున్నాయి గోడల మీద నుండి. అతనెలా కదిలితే, అవీ అదేలా కదులుతున్నాయి. సరదాగా ఒక చెయ్యి, ఒక కాలు పొడుగ్గా చాపాడు. వెంటనే ఒక కెమెరా అటువైపు కదిలింది. అంతలో గార్డు లేచి వచ్చాడు కౌంటరు వెనుక నుండి. ఒక స్పెషల్ కార్డు తీసి, ఆ గాజు తలుపు పక్కనే ఉన్న కీపాడ్ వెనుక పెట్టి, కీపాడ్ మీద కొన్ని నంబర్లు నొక్కాడు. బ్యాంకు ఏటియమ్ కార్డులా. తలుపు తెరుచుకోగానే సూటు వేసుకున్న ఒకతను బయటకు వచ్చి, అరవింద్‌కు షేక్‌హాండ్ ఇచ్చి, తనను తాను రిషీకుమార్ అని పరిచయం చేసుకున్నాడు. తనతోపాటు లోపలకు తీసికెళ్ళాడు.

అరవింద్ ఒక సైంటిస్టు. రెండు పీహెచ్‌డీలు ఉన్నాయతనికి. ఈ కంపెనీ అరవింద్ వంటి మేధావులను దేశమంతా వెదకి తెచ్చుకుంటుంది. వీళ్ళు 'నానో టెక్నాలజీ' అనే అంశం మీద రీసెర్చు చేస్తున్నారు. దీనివల్ల ప్రస్తుతం ఉన్న కంప్యూటర్ల వేగం కొన్ని వందల రెట్లు పెరుగుతుంది. ఎంతో నైపుణ్యం అవసరమైన శస్త్రచికిత్సలు చాలా సులువుగా జరపగల 'నానోబోట్స్' వంటివి డిజైన్ చెయ్యటమే ఈ కంపెనీ పని. ప్రపంచంలోనే అతి తక్కువ ఇటువంటి కంపెనీలు.

అరవింద్‌ను తీసుకెళ్ళి అతను పనిచేయబోయే డిపార్టుమెంటులో అందరికీ పరిచయం చేసాడు రిషీ. చాలావరకు అందరూ ముభావంగా ఉన్నారెందుకో. ఒకరిద్దరు కాస్త మనస్ఫూర్తిగా పలకరించారు అరవిందును. కొందరయితే మాట్లాడితే నోటి ముత్యాలు రాలిపోతాయేమో అన్నట్టు కనీసం 'హలో' అని కూడా అనలేదు. ఓసారి తల పంకించారు, అంతే.

"ఈరోజు మిగతా ఫార్మాలిటీస్ పూర్తిచేద్దాం. రేపటి నుండి మీరు టీములో పనిచెయ్యచ్చు" అని చెప్పి రిషీ అరవింద్‌ను పై అంతస్థులలో ఉన్న తన ఆఫీసుకు తీసుకెళ్ళాడు.

కాస్త మొహమాటపడుతూనే అరవిందు రిషీను అడిగాడు- "ఏదైనా వర్క్ ప్రాబ్లమా? ఒక ముగ్గురు, నలుగురు తప్ప అందరూ కాస్త ముభావంగా కనిపించారు?" అని.

రిషీ అదోలా చూసి- "అంతే ఉంటుందిలెండి" అంటూ ఏవో ఫారమ్స్ నింపమని ఇచ్చాడు అరవిందుకు.

ఆ రోజంతా అతను ఆ కంపెనీ గురించి తెలుసుకుంటూ, పేపర్లు తయారు చేస్తూ బిజీగా ఉండిపోయాడు.

రిషీ అవన్నీ కంప్యూటర్‌లో ఎక్కించాడు. సాయంత్రం వెళ్ళేముందు రిషీ అరవిందుకు ఒక ఐడి కార్డు, ఒక పాస్‌వర్డూ ఇచ్చాడు.

ఒక చిన్న మాప్ కూడా ఇచ్చాడు. ఆ మాపు అరవింద్ పనిచేసే డిపార్టుమెంటు, దాని ప్రయోగశాలల గదులూ, జాగ్రత్త పడవలసిన స్థలాల హెచ్చరికలతో నిండి వుంది.

"గుడ్‌లక్ అరవింద్. రేపు మీరు మీ డిపార్టుమెంటుకే వెళ్ళిపొండి. ఏదైనా అవసరమైతే నన్ను పిలవండి" అని చెప్పాడు రిషీ.

మరునాడు ఉదయం అరవింద్ బయట సెక్యూరిటీ గార్డుకు తన ఐడి కార్డు చూపించి తన పాస్‌వర్డు నొక్కి లోపలికి వెళ్ళాడు. అంతకు ముందురోజు సరిగ్గా గమనించలేదు కానీ, అదొక సువిశాలమైన హాలు-కనీసం ఇరవై తలుపులు ఉన్నాయందులో.

ఆ రూములన్నింటికీ మళ్ళీ వేరే పాస్‌వర్డు కావాలి. అంటే ఎవరికి అవసరమైన ప్రదేశాలకు వాళ్ళ పాస్‌వర్డు పనిచేస్తుంది. వేరే రూముల్లోకి, లేదా లిఫ్టు ఎక్కి వేరే అంతస్థుల్లోకి వెళ్ళటానికి వీలు లేదన్నమాట. అరవింద్ పని చెయ్యాల్సిన లాబ్ భూగర్భంలో మూడో అంతస్థులో ఉంది. అంటే ఈ భవనంపైన కనబడే పన్నెండు అంతస్థులే కాక, భూమిలోకి ఇంకో మూడు ఉన్నాయన్నమాట అనుకున్నాడు అరవింద్ మ్యాపు చూస్తూ.

సరిగ్గానే వెతుక్కుని వెళ్ళాడు తన ఆఫీసుకు. అక్కడ నీనా అనే ఆఫీసరు వచ్చి అరవింద్‌ను పలకరించి, అతని పని వివరించింది. టీములో ఎవరెవరితో ఎక్కువగా కలవాలో చెప్పింది. టీములో చాలామంది ముందు రోజులానే ముభావంగా ఉన్నారు. నీనా కాస్త మేలు. అందరికన్నా కాస్త నవ్వుతూ ఉంది.

అరవింద్ ఆఫీస్‌లో ఎన్నో చిన్న చిన్న క్యూబికర్స్- అంటే చిన్న గదుల వంటివి ఉన్నాయి. అటువంటి చోట్ల ఈ పరిశోధకులందరూ ప్రత్యేకంగా తయారు చేసిన దుస్తులూ, మొహానికీ, చేతులకూ, చివరకు తలమీద కూడా మాస్కులు ధరించి వెళ్ళాలి.

అక్కడ అతి శుద్ధమైన వాతావరణంలోనే ఈ నానో టెక్ మీద పరిశోధనలు జరుగుతూ ఉంటాయి. నానో అంటే మిల్లీమీటరులో వెయ్యోవంతు అన్నమాట. అతి చిన్న సూక్ష్మ పరిమాణం గల ఈ పదార్థాలతో పరిశోధన అంటే, ఎంతో ఏకాగ్రత కావాలి. అంకిత భావం ఉండాలి.

నానో లాబ్‌లోకి వెళ్ళాలంటే ముందు బయట గదిలో ప్రత్యేకమైన దుస్తులు ధరించి తలుపేసుకోవాలి. ఆ పరిశోధకుల మీద శుద్ధి చేసే గాలి వదులుతారు. ఆ తరువాత లోపలి గది తలుపు తెరుచుకుంటుంది. అంటే ఆఫీసుల నుండి ఏకాఎకిన లోపల పరిశోధనా స్థలాల్లోకి వెళ్ళే వీలుండదు. అదికాక ప్రతి గదికీ ఒక పాస్‌వర్డు. ఒక్కో గదికీ ఒకరి వద్ద ఉంటుంది పాస్‌వర్డు. అంటే ఈ ఆఫీసంతా ఒక పజిలనుకుంటే, ఆ పజిల్లో ముక్కలు ఒక్కోరి వద్ద ఒక్కోటి వుంటాయి. ఇంత దిట్టమైన సెక్యూరిటీ మధ్య పనిచేయటం అరవింద్‌కు కొత్త అనుభవం.


కొద్దిరోజుల్లోనే మెల్లగా సర్దుకున్నాడు అరవింద్. ఇంకో విషయం అతనికి స్పష్టంగా అర్థమైంది ఏమిటంటే, ఈ పనిలో అందరికీ తోటివారి సహకారం ఎంతో అవసరం. అది వ్యక్తి ప్రాధాన్యం ఉన్న పరిశోధన కాదు, సంఘటితంగా చేసే ప్రయోగాలవి. ఒకరికొకరు తెలియనివి చెప్పటమేకాక, ఏ ప్రదేశానికి వెళ్ళాలన్నా పాస్‌వర్డు ఎవరో ఒకరి వద్దే ఉంటుంది. అది అప్పుడప్పుడూ మారుతుంది కూడా.

కానీ వీటన్నిటికన్నా అరవిందును కష్టపెట్టింది మిగతావారి ముభావమే. ఒక రోజో లేక రెండు రోజులో కాదు. నిరంతరం అలాగే ఉంటారు ఆ టీమ్‌లో వాళ్ళు. గొప్ప పరిశోధనలే అయినా, ఏదో అందరూ కలిసి పనిచెయ్యటమూ, అప్పుడప్పుడూ సరదాగా ఉండటమూ

వంటివి ఉంటాయనుకున్న అరవింద్‌కు విసుగొస్తోంది క్కడ.

ఏ సమయంలోనైనా అక్కడ మౌనం రాజ్యమేలుతూ ఉంటుంది. ఏదైనా అడగాలన్నా మొదట్లో ఎంతో సందేహించాడతను. అడిగితే మాత్రం అందరూ సహాయం చేస్తూనే ఉన్నారు. కానీ ఎక్కువగా ఎవ్వరూ మాట్లాడరు. అసలు నవ్వరు.

ఫలానా పుస్తకం కావాలంటే రవి వేరే ఆఫీసుకైనా సరే వెళ్ళి తెచ్చిపెడతాడు. థ్యాంక్స్ అంటే తల ఊపి వెళ్ళిపోతాడు. నీనా వీటికి అలవాటు పడిపోయినట్లు అనిపిస్తుంది. చంద్రం, ప్రతీక్ అనే ఇద్దరు మాత్రం మామూలుగా ఉంటారు ఈ ఆఫీసులో.



అన్నిటికన్నా విచిత్రమేమంటే, ముఖావంగా ఉండేవారందరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవటం కూడా అరవింద్ చూడలేదు. అయినా పనులు జరుగుతూనే ఉంటాయి, ఒకరికొకరు సాయం చేసుకున్నట్లే కనిపిస్తారు. కనీసం పాస్‌వర్డులు ఒకరికొకరు ఇవ్వటం కూడా చూడలేదు అరవింద్. కానీ ఎవరంతకు వాళ్ళు అప్పుడప్పుడూ తమలో తాము నవ్వుకోవటం చూసాడు.

కంప్యూటర్ ముందో, ల్యాబ్‌లోనో ఉన్నట్టుండి ఎవరో నవ్వుతారు, ఎందుకో తెలీదు. పక్కనెవ్వరూ కూడా ఉండరు. ఉండబట్టలేక ఒకరోజు చంద్రాన్ని పట్టుకుని అడిగేసాడు అరవింద్- వాళ్ళు ఎందుకలా నవ్వుతారని.

"మీకెందుకండీ వాళ్ళ నవ్వులూ? నేను నవ్విస్తాను రండి మిమ్మల్ని" అన్నాడు కానీ, చంద్రం ఇంకేమీ చెప్పలేదు. ప్రతీక్ అయితే అసలు మాట దాటవేసాడు.

ఇలా రెండు నెలలు గడిచేటప్పటికి అరవిందుకు చాలా విసుగొచ్చేసింది. రాజీనామా లేఖ రాసి ఆఫీసరైన నీనా దగ్గరకు వెళ్ళి ఇచ్చేసాడు. ఇక నేనిక్కడ ఉండలేనని చెప్పేసాడు. ఆశ్చర్యపోయింది నీనా!

"అదేమిటి? అందరూ ఎంతో మెచ్చుకుంటున్నారు మిమ్మల్ని ఇక్కడ. ఏం జరిగింది?" అని అడిగింది.

"మెచ్చుకుంటున్నారా? నన్నా? ఎక్కడా? ఎప్పుడూ? రెండు నెలలుగా ఒక్క మాట కానీ, కనీసం ఒక్క జోకు కానీ ఈ ఆఫీసులో వినబడలేదు నాకు. అసలు ఇక్కడ పని చేస్తున్నది మనుషులా? లేక మర మనుషులా?" కోపంగా అడిగాడు అరవింద్.

ఈ ముభావాన్నీ, మౌనాలను ఇక భరించలేనని మొరపెట్టుకున్నాడు. నీనా అతని గోడంతా వింది. తరువాత ఒక పది నిముషాలు ఏమీ మాట్లాడలేదు. చివరకు నిట్టూర్చి "పదండి, రిషీ దగ్గరకు వెళ్దాము" అని తీసుకెళ్ళింది.

ఇద్దరూ కలిసి బయట హాల్లోకి వచ్చి, లిఫ్టు తీసుకుని ఏడో అంతస్థులో ఉన్న రిషీ ఆఫీసుకు వెళ్ళారు. అందరూ కాఫీలు తెచ్చుకుని కూర్చున్నాక నీనా చెప్పింది రిషీకు- "రిషీ, అరవింద్ కూడా పాత సమస్యే తీసుకొచ్చాడు" అని. రిషీ గొంతు సవరించుకున్నాడు. ఇలా చెప్పుకొచ్చాడు. "చూడండి అరవింద్, మీ టీములో ఉన్నవాళ్ళందరూ దాదాపు పదిహేను సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తున్నారు. వాళ్ళ పరిశోధనలే ఈ కంపెనీని ఈరోజు ఇక్కడ నిలిపాయి. ఇంకా వాళ్ళకున్న ఐడియాలు అనంతం అనిపిస్తుంది. వాళ్ళందరూ ఒకరికొకరు చాలా సన్నిహితులు ఇప్పుడు. ఇన్నేళ్ళు కలసి పనిచేసాక అది సహజమే!" అని ఆగాడు.

"అంటే ఇప్పుడు నేను బయటివాడిననా? అందుకే అలా ఉంటారా నాతో?" కోపంగా అడిగాడు అరవింద్.

"కూల్‌డౌన్ అరవింద్! నన్ను చెప్పనీ పూర్తిగా. దాదాపు అయిదేళ్ళ క్రితం అమెరికా నుండి వచ్చిన ఒక డాక్టరు మాకు ఒక కొత్త టెక్నాలజీ గురించి చెప్పాడు. ఒక స్పెషల్ ఆపరేషన్ ద్వారా, మనసు లేదా మెదళ్ళను కలపటమే ఆ టెక్నాలజీ. ఈ టీములో ఉన్న అరవైమందీ, అది చేయించుకుంటామని ముందుకు వచ్చారు. ఆ శస్త్రచికిత్స వల్ల వాళ్ళందరూ బయటికి మాట్లాడకుండానే తమ ఆలోచనలు పక్కవారికి చేరవేస్తారు. అంటే వారందరూ, వారిలో వారు మిగతావారి ఆలోచనలు 'వినగలరు'. వారికి అది పెద్ద వరమనిపించింది" అని రిషీ చెప్తూ ఉంటే "ఇంపాజిబుల్" అరిచాడు అరవింద్.

"భూమి గుండ్రంగా తన చుట్టూ తాను తిరుగుతోంది అంటే ఒకప్పుడు ఒప్పుకోక ఖగోళ శాస్త్ర పితామహుడైన గెలీలియోను యూరోపు నుండి తరిమికొట్టారు. మిస్టర్ అరవింద్, ఈ ప్రపంచంలో మనకు తెలియకపోతే అది ఇంపాజిబుల్ అనరాదు. ఎనీవే, ఈరోజు వాళ్ళందరూ బ్రెయిన్‌లో అమర్చిన చిన్న పరికరం ద్వారా ఒకరి ఆలోచనలు ఒకరు చదివేస్తారు. మన మాటల్లాగా వాళ్ళకు ఇతరుల ఆలోచనలు వినబడతాయి. అందువల్ల వాళ్ళు బయటకు ఎక్కువగా మాట్లాడరు. చివరకు హాస్యమైనా సరే వాళ్ళు ఆలోచనల్లోనే ఇచ్చి పుచ్చుకుంటూ సాగుతుంది. అందుకే ఎవరిలో వాళ్ళు నవ్వుకుంటూ ఉంటారు. మీరేమీ అనుకోకుండా మీ పని మీరు చూసుకోండి, ప్లీజ్" చెప్పాడు రిషీ.

"అంటే వీళ్ళు నా మనసు కూడా చదువుతారా?" ఆశ్చర్యంగా అడిగాడు అరవింద్.

"లేదు కేవలం ఆ గ్రూపులో వాళ్ళకే ఒక స్పెషల్ పరికరం మెదడులో ఉంది కాబట్టి, వాళ్ళల్లో వాళ్ళే చెయ్యగలరది. మిగతా వారి ఆలోచనలు వాళ్ళకు తెలియవు" అంటూ విడమర్చి చెప్పాడు రిషీ.

అరవింద్ ఆలోచనలు దౌడు తీస్తున్నాయి- "అందుకే వాళ్ళు ఎవరినీ ఏమీ అడగరు, చివరకు పాస్‌వర్డ్స్ కూడా. అన్నీ ఆలోచనలతోనే చేస్తారన్నమాట. ఇంకా ఎన్నెన్నో ఉపయోగాలు దీనివల్ల. ఒక ఐడియా పదిమందికి చెప్పి, అర్థంకాక తలబాదుకునే బదులు, దీనివల్ల అందరూ ఒకేసారి వింటారు ఆ ఆలోచన" ఇలా వెళ్తున్నాయి అరవింద్ ఆలోచనలు.

"మరైతే నేను కూడా చేయించుకుంటాను ఆ ఆపరేషన్" ఉత్సాహంగా అడిగాడు అరవింద్.

దీర్ఘంగా నిట్టూర్చి చెప్పాడు రిషీ- "మీరు కనీసం నెల రోజులు దీని గురించి ఆలోచించండి. అందరూ దీన్ని తట్టుకోలేరు" చంద్రం, ప్రతీక్ కూడా చేయించుకోలేదు. ఒకసారి వాళ్ళతో మాట్లాడి చూడు అన్నది నీనా కూడా. అయిష్టంగానే ఒప్పుకున్నాడు అరవింద్.

ఎప్పుడూ లేనిది ఆ సాయంత్రం చంద్రం, ప్రతీక్ ఇద్దరూ అరవింద్ ఇల్లు వెతుక్కుని వస్తే, అరవింద్‌కు విషయం అర్థమైపోయింది. పిచ్చాపాటీ మాటలూ, కాఫీలూ అయ్యాక చంద్రం ఉన్నట్టుండి "మేరీ ఆత్మహత్య చేసుకుంది తెలుసా?" అన్నాడు.

ప్రతీక్ వివరించాడు. "మేరీ మా టాప్ సైంటిస్టు. జీనియస్ అని చెప్పచ్చు. ఈ బ్రెయిన్ ఆపరేషన్ తరువాత ఆ స్ట్రెస్, మానసిక ఒత్తిడి తట్టుకోలేకపోయింది. ఎందుకు చెప్తున్నామో అర్థం చేసుకో అరవింద్. మేము చాలా ఆలోచించి ఈ ఆపరేషన్ చేయించుకోలేదు. నీకు దాదాపు యాభై మైళ్ళ దూరం వరకూ నీ టీమ్ ఆలోచనలు నీకు 'వినబడతాయి'. అంటే ఇంటికి వచ్చినా నీ చుట్టూ అరవై మంది ఉన్నట్టే ఉంటుంది. వ్యక్తికి శారీరకంగానే కాదు మానసికంగా కూడా ప్రైవసీ చాలా ముఖ్యం" అని చాలా నచ్చచెప్పారు ఇద్దరూ.

అరవింద్ అన్నాడు "సరే, అంత కష్టం అనిపిస్తే మళ్ళీ ఆపరేషన్ చేసి బ్రెయిన్‌లోంచి ఆ పరికరం తీయించుకుంటాను" అని. చంద్రం, ప్రతీక్ మొహమొహాలు చూసుకున్నారు.

"అంత సులువుగా చెయ్యదు ఆ పని ఈ కంపెనీ. ఒకసారి ఆ గ్రూపులో చేరిపొయ్యాక, మళ్ళీ వెనక్కు అంత త్వరగా వెళ్ళనివ్వరు. ఆ పరికరం తలలో నుండి తీసేవరకూ కంపెనీ వదిలి వెళ్ళనని ప్రమాణం చెయ్యాలి. చట్టపరంగా పేపర్ల మీద సంతకం పెట్టాలి. చాలా నిఘా ఉంటుంది నీ మీద" అని కూడా చెప్పారు. సరే, ఆలోచించే చేస్తానని అరవింద్ వాళ్ళకు మాట ఇచ్చాడు.



నెలలో ఆపరేషన్ చేయించేసుకున్నాడని చంద్రం, ప్రతీక్ విన్నారు. చాలా బాధపడ్డారు. అరవింద్‌కు మాత్రం కలలో కూడా ఎరగని ఒక కొత్త ప్రపంచం అతని ముందు ప్రత్యక్షమైనట్టుగా ఉంది. అతని టీములో మిగతా వాళ్ళు మౌనంగానే అభినందనలు తెలిపారు. ఆహ్వానించారు వాళ్ళ లోకంలోకి.

"బాగా ఆలోచించాడంటావా?" ఒకరితో ఒకరు ఆలోచనా తరంగాలతో మాట్లాడటం వినిపించింది. "వాడి ఖర్మ" ఇంకెవరో- ఇలా తన గురించి తన వెనుక అనుకునే విషయాలు తన ముందే అంటున్నట్టుగా ఉంది అరవింద్‌కు.

మెల్లగా పనిలో పడ్డాక ఎంతో హాయనిపించింది. ఈ 'ఆలోచన భాష'. నోరు విప్పి ఏమీ చెప్పకుండానే పదిమందితో ఒకేసారి సంభాషిస్తున్నాడు. మధ్యలో ఏదో ప్రాబ్లమ్‌కు ఉన్నట్టుండి ఏదో అయిడియా స్ఫురించగానే, పది గొంతులు (మనసులు) 'వెరీగుడ్' అన్నాయి. ఉలిక్కిపడ్డాడు అరవింద్.

కాలం గడవసాగింది తన రీతిలో. అరవింద్‌కు తను చేసిన పనిమీద అనుమానాలు మొదలయ్యాయి. తన చిన్న ప్రపంచంలో ఉండే ప్రతి ఒక్కటీ బహిరంగమైనట్టుంది అతనికి. తన కోపాలు, ఆశలు, కోరికలూ, సంతోషాలు, సుఖాలు అన్నీ బహిర్గతమే. అందరి ఎదుటా మొదట్లో సిగ్గుపడేవాడు కూడా. రాను రాను విసుగు రావటం మొదలయ్యింది.

యూరోపు వెళ్ళాలని అరవింద్ చిన్ననాటి కల. ఒకరోజు అది మనసులోకి వచ్చింది. రాగానే ఆరేడు మంది కామెంట్లు విసరటం మొదలుపెట్టారు. గట్టిగా అరిచాడు మనసులోనే అరవింద్- 'షటప్. ఇది నా స్వంత విషయం. మీకెందుకు' అని. ఇలా ఎన్నో, ఎన్నెన్నో. ఇంటికి వచ్చినా ఆగని మాటలు. మరి యాభై మైళ్ళ దూరం వరకూ ఆలోచనలు వినబడతాయి కదా.

పదిరోజులయ్యాక ఒకసారి ఆదివారం దూరంగా వేరే ఊరికి వెళ్ళిపోయాడు అరవింద్. చెప్పలేనంత హాయి అనిపించింది. ఎవ్వరి ఆలోచనలు వినబడలేదు, ఓసారి అందరినీ, తనను తానూ తిట్టుకున్నాడు. హోటల్ బయట తోటలో కూర్చుని, వచ్చి వెళ్ళే వాళ్ళందరి మీదా మనసులో కామెంట్లు చేసాడు- ఎవ్వరూ ఏమీ పట్టించుకోలేదు అతన్ని. రైల్లో పక్కవాళ్ళను పిలిచి మాట్లాడించాడు. ఉన్నట్టుండి తననే అనుసరిస్తున్న ఇద్దరు వ్యక్తులను గమనించాడు అరవింద్. వాళ్ళు ఆ రోజంతా తన వెంటే ఉన్నారు. కంపెనీ మనుషులని అర్థమైపోయింది అతనికి. ఎంతో దిగులుగా మరునాడు ఆఫీసుకు వెళ్ళాడు.

ఇలా పదిరోజుల కొకసారి శెలవులో పరిగెత్తి ఎక్కడికైనా దూరంగా వెళ్ళిపోతేనే కాని మనశ్శాంతి కరువైపోయింది అరవిందుకు. మెల్లగా మెడిటేషన్ నేర్చుకుని ఆలోచనలు నియంత్రించటం మొదలుపెట్టాడతను. ఆఫీసులో పని ఆలోచనలు తప్ప వేరేవీ రానీయటం లేదతను. అరవింద్ మీద మొదట్లో నిఘా ఎక్కువగా ఉండేది. సినిమాకు వెళ్ళినా వెంటే ఉండేవారు కంపెనీ మనుషులు. మరి కంపెనీలు తమ 'పెట్టుబడి' కాపాడుకోవాలి కదా. మెల్లగా రెండు నెలల్లో అతని మీద నిఘా తగ్గింది. శెలవల్లో తన కార్యక్రమాన్ని ప్లాన్ చేసుకున్నాడు. ఎలాగైనా ఇక్కడి నుండి తప్పించుకోవాలనే తపన ఎక్కువైపోయింది అతనిలో.

తన పాస్‌పోర్టు తన దగ్గరే ఉంచుకోవడం మొదలుపెట్టాడు. మెల్లగా తన బ్యాంకుల్లో డబ్బు తీసేసి అక్కౌంట్లు మూసేసాడు. కొంత డబ్బు బంగారంగా మార్చుకున్నాడు. రెండు నెలల ఇంటి అద్దె ముందే కట్టేసాడు. ఎవరో పేరుతో ఒక పాత కారు కొన్నాడు. అతనికి ప్రపంచంలో తనవాళ్ళు ఎవరూ లేరు. అప్పటికి అతని మీద నిఘా పోయింది. ఆరోజు ఆదివారం, అయినా ఆఫీసుకు వెళ్ళాడు. మాస్టర్ కంప్యూటర్ గంటలో హాక్ చేసాడు. తన విషయాలన్నీ డిలీట్ చేసేసాడు. బయటికి వచ్చి చెన్నై దారి పట్టాడు.

గమనిక:- ఈమధ్యే మంచి పర్యాటక కేంద్రంగా పేరు పొందిన అండమాన్‌కు ఎవరైనా వెళ్తే, అక్కడ పొడవాటి ఎర్ర జుట్టుండే ఒక గైడు కోసం చూడండి. ద్వీపాల్లోని పక్షి, జంతు, వృక్ష జాతులే కాక శిలాజాలు, ఇంకా ఎన్నెన్నో విశేషాలు వివరించగల జీనియస్సు అతడు.

మరి మనుషులు, వారి మేధ తన సొత్తు, బొమ్మలు చేసి ఆడించవచ్చు అనుకునే కాపిటలిస్టిక్ కంపెనీలు అన్ని వేళల్లో గెలవలేవు!

## ప్రియమణి పాటలు

మమతా మోహన్‌దాస్ నటించడమే కాదు, పాటలు కూడా పాడుతుందని తెలుసుకదా! రెండు వైపులా రెమ్యునరేషనూ, పబ్లిసిటీ కూడాను. ఇలాగే ప్రియమణి కూడా భావిస్తున్నట్టుంది. ఇటీవల ఓ తమిళ చిత్రంలో ప్రియమణి పాట పాడిందిట. ఆ పాట బాగానే వుందని జనాలు అనటం ఆలస్యం- ఇప్పుడు తెలుగులోనూ పాడతానని నిర్మాతల్ని పోరు పెడుతున్నట్టు ఫిలింనగర్‌లో జనాలు గుసగుసలాడుకుంటున్నారు. మరి ఆమె మధుర గానామృతాన్ని మనమూ వింటామేమో!